పుస్తక ప్రదర్శన



పుస్తకాల సముద్రం 'బుక్‌ఫెయిర్'

- కోలాహలంగా ఎన్‌టిఆర్ స్టేడియం
- లక్షలాదిగా ఔత్సాహికుల రాక
- మేధావులు, విద్యార్థులు, మహిళల భారీ స్పందన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అది ఎన్‌టిఆర్ ఎన్‌టిఆర్ స్టేడియం..సాయంత్రం ఐదు గంటల సమయం..హైదరాబాద్ బుక్‌ఫెయిర్ జరుగుతున్న ప్రాంతం..కొలాహలంగా కనిపిస్తున్నది.. చిన్నారుల దగ్గర నుంచి పెద్దల వరకు అన్ని వయస్సుల వారూ కనిపిస్తున్నారు..ముఖ్యంగా యువత..అందులోనూ మహిళలు..క్యూలైన్లో నుంచుని టికెట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నా..మస్తిష్కంలో ఆలోచనలు 'పుస్తకం' గురించే.

లోపలకెళ్లి చూద్దునుకదా గుంపులుగా గుంపులుగా బుక్‌స్టాళ్ల ముందు పుస్తక ప్రియులు..కొందరు పుటలు తిరగేస్తుంటే.. మరికొందరు ఆ పుస్తకం, ఈ పుస్తకం చూపించండి అంటున్నారు.. చర్చించుకుంటున్నారు.. ఇంకొందరు సెల్ఫీలు దిగుతూ సోషల్‌మీడియాలో పెట్టుకునే పనిలో తీరికలేకుండా ఉన్నారు. ఒకవైపు ఈ సందడి ఇలావుండగానే, మరోవైపు ప్రత్యేంగా అలంకరించిన వేదికపై పుస్తకావిష్కరణలతో హడివిడిగా ఉన్నారు నిర్వాహకులు. పుస్తకం అంటే ఏమిటీ ? ఎందుకు కొనాలి ? ఎందుకు చదవాలి ? తదితర సాధారణ ప్రశ్నలు సహజంగానే ఉదయిస్తుంటాయి. దానికి నాకు 35 ఏళ్ల క్రితం జరిగిన సంఘటన ఇప్పటికీ గుర్తే ఉంది. అదేమంటే..అదో ఆస్పత్రి..నెల్లూరు ప్రజావైద్యశాల..కిటకిటగానే ఉంది. అటూ, ఇటూ తిరుగుతున్నారు రోగులు, డాక్టర్లు.. ముఖాల్లో టెన్షన్ స్పష్టమవుతోంది. ఒక వ్యక్తి దవఖానాలోనికి అడుగుపెట్టాడు. ఏదో రూమ్‌కోసం వెతుకుతున్నారు. ఆ గదిని కనిపెట్టారు. తట్టిలోపలికెళ్లారు. అక్కడో వ్యక్తి మంచం మీద పడుకున్నారు. ఒకవైపు చేయికి సెలైన్ ఎక్కిస్తున్నారు. మరోవైపు ఆయన ఏదో పుస్తకం చదువుతున్నారు. మంచం మీద వైద్యం చేయించుకుంటున్న వ్యక్తి మార్క్సిస్టు మహామేధావి పుచ్చలపల్లి సుందరయ్య అయితే, లోపలికి పరామర్శ కోసం వెళ్లిన వ్యక్తి ఆ పార్టీ సీనియర్ కామ్రేడ్. అప్పుడు వారి మధ్య సమకాలీన విషయాలకు సంబంధించి అనేకం చర్చకు వచ్చాయి. 'అనారోగ్యంతో ఉన్నారు..రెస్ట్ తీసుకోవచ్చు కదా..పుస్తకాలు ఎందుకు చదవడం.. అలసట వస్తుంది' అని కామ్రేడ్ అంటే, అప్పుడు సుందరయ్య 'నేను పుస్తకం చదవకుండా, నేర్చుకోకుండా మీకేమీ చెప్పగలను, పార్టీ యంత్రాంగానికి ఏమీ జ్ఞానం పంచగలను' అంటూ వ్యాఖ్యానించారట. తర్వాత ఒకానొక సందర్భంగాలో ఆ పార్టీ కామ్రేడ్ చెప్పారు. అదీ పుస్తకం విలువ. హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో కలియతిరుగుతున్న క్రమంలో ఎంతో మంది కవులు,రచయితలు, మేధావులు, ఉపాధ్యాయులు, స్టాళ్ల యాజమానులు, నిర్వాహకులతో పలకరిస్తూ ముందుకు సాగుతున్నాను. ఏ షాపులో చూసినా వందల, వేల పుస్తకాలు. అదీ, ఇదీ అని కాదు. ఎన్నో పుస్తకాలు..ఎన్నెన్నో నవలలు. జనరల్ నాలెడ్జీతోపాటు వామపక్ష సాహిత్యం, నిరుద్యోగలకు అవసరమయ్యే పుస్తకాలు, చిన్నారులకు ఆనందాన్నిచ్చే కామిక్స్, మహిళలకు తోడ్పడే గ్రంథాలు మరెన్నో. చివరకూ భక్తిపుస్తకాలూ ఉన్నాయి సుమా. ఒక్కటేమిటీ అన్నీనూ. తెలుగు, ఇంగ్లీషుతోపాటు ఇతర భాషలకు సంబంధించిన పుస్తకాలూ ఉన్నాయి బుక్‌ఫెయిర్‌లో ! ఒక్క మాటలో చెప్పాలంటే అదీ పుస్తకాల సముద్రమే. దాదాపు మూడోందలకుపైగా స్టాళ్లతో ఎన్‌టిఆర్ స్టేడియం విరబూసిందనే చెప్పాలి.

విపక్షాలు లేకుండా చేసే కుట్ర

- ఏకఛత్రాధిపత్యం కోసం బిజెపి కుటిల యత్నాలు
- మోడీ, షా మాత్రమే శాశ్వతం కాదు
- వామపక్ష పాలన ఉంది కాబట్టే కేరళ అభివృద్ధి
- మోడీ పాలనలో ఆకలిదేశంగా భారత్
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో అఖిల భారత అధ్యక్షులు విజయరాఘవన్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేస్తున్న బిజెపి చివరకు విపక్షాలు కూడా లేకుండా చేయాలని కుట్ర చూస్తున్నదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు విజయరాఘవన్ అన్నారు. మోడీ, అమిత్‌షా మాత్రమే శాశ్వతం కాదన్నారు. క్షేత్రస్థాయిలో మన ప్రజాస్వామ్య పురోగామి శక్తులను మనవైపు తిప్పుకోవాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావునగర్ (భక్తరామదాసు కళాక్షేత్రం)లోని అమరవీరుల ప్రాంగణంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభ శుక్రవారం ప్రారంభం అయ్యాయి. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు పి.సోమయ్య అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నాయకులు అమవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. సంతాప తీర్మానాన్ని వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ ప్రవేశపెట్టారు. మహాసభ రెండు నిమిషాల మౌనం పాటించి అమరవీరును స్మరించుకున్నది. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య అధ్యక్షత వహించిన మహాసభనుద్దేశించి విజయరాఘవన్ మాట్లాడుతూ. వీరతెలంగాణ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. బిజెపి నిరంకుశ రాజకీయాలు చేస్తూ పార్లమెంట్, అసెంబ్లీలను ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. సామాన్య ప్రజానీకం గురించి మాట్లాడే అవకాశం కూడా ఇవ్వట్లేదనీ, కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతున్నదని విమర్శించారు. మనిషి అనే భావనను కూడా నశింపజేస్తున్నదన్నారు. వెనుకబడిన వర్గాలు బతికే పరిస్థితి కూడా లేదన్నారు. లౌకిక విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. వామపక్ష పాలనలో ఉంది కాబట్టే కేరళ అభివృద్ధిలో, మానవాభివృద్ధి సంచిలో నెంబర్ వన్ గా ఉందని చెప్పారు కాబట్టే భూసంస్కరణలు, భూ పునఃపంపిణీ తమ రాష్ట్రంలో సాధ్యమైందని తెలిపారు. కేరళ రాష్ట్రంలో ఎనిమిది లక్షల మంది వ్యవసాయ కార్మికులుంటే తమ సంఘంలో 25 లక్షల మంది సభ్యులున్నారని తెలిపారు. సమస్యలు ఎదుర్కొంటున్న ఇతరులూ సంఘంలో ఉన్నారని చెప్పారు. 75 ఏండ్ల ఆజాదీకా అమృత్ మహోత్సవాలు జరుపుతున్న తరుణంలోనూ ఆకలి దేశంగా ఉండటం శోచనీయమన్నారు. ఈ విషయంలో ప్రపంచంలో మన దేశం 121వ స్థానంలో ఉండటం దారుణమన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎస్‌టి, ఎస్‌సి మహిళలపై ఆకృత్యాలు అధికమయ్యాయని చెప్పారు. ముదిగొండలో ఏడుగురు భూ పోరాటంలో ప్రాణ త్యాగం చేసిన విషయాన్ని స్మరించుకున్నారు. భూ పోరాటల్లో సంఘం చొరవ మంచి ఫలితాలను రాబట్టిందన్నారు.?

డాక్టరైనా.. యాక్టరైనా కష్టజీవుల పక్షానే..

డాక్టరయినా, యాక్టరయినా కష్టజీవుల పక్షాన నిలబడాల్సిందేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్ అన్నారు. రైతు ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల పని అయిపోయింది అనే వారికి నిన్నటి సభ కమ్యూనిస్టులతోనే ప్రజలకు పని ఉందనే ఆవశ్యకతను చాటిందని చెప్పారు. ఈ మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కౌలురైతు, రైతుబంధు. రుణ సౌకర్యం, విద్య, వైద్యం లాంటి కనీస సౌకర్యాల కోసం ఫలవంతమైన చర్చలు మహాసభల్లో జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులందర్నీ ఐక్యం చేసి కుల, మత ప్రాంతీయ ధోరణిలతో పనిచేసే విచ్ఛిన్నకర శక్తులను దూరం చేస్తూ ధృడమైన ప్రణాళిక రూపొందించాలని ఆకాంక్షించారు.

- ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్

దున్నే భూములను లాగి కార్పొరేట్లకు ధారాదత్తం

దున్నేవాడికే భూమి అని వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకులు పుచ్చలపల్లి సుందరయ్య పోరాడితే నేటి పాలకులు మాత్రం కార్పొరేటు శక్తులకే భూమి అన్నట్టు చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు పి.సోమయ్య అన్నారు. నిజమైన అన్నదాత అంటే వ్యవసాయ కార్మికుడేనని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు ఓ చట్టం ఉండాలని సిపిఎం నేత, మాజీ ఎంపి హరికిషన్ సూర్జిత్ పార్లమెంట్లో ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. రెవెన్యూ, మార్కెటింగ్, ఎక్సైజ్ పన్నుల తదితర రూపాల్లో ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో అత్యధికంగా వ్యవసాయ కార్మికుల ద్వారానే లభిస్తున్నదని చెప్పారు. వాటిలో 10 శాతం వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. సమాజానికి అట్టడుగున ఉంటూ అన్యాయానికి గురవుతున్నది వ్యవసాయ కార్మికులేనని చెప్పారు.

1934లోనే సుందరయ్య వారి కోసం ప్రత్యేక సంఘాన్ని స్థాపించారన్నారు. మహాసభలో యాదాద్రి భువనగిరి నాయకులు రొడ్డ అంజయ్య, వేముల మహేందర్ జ్ఞాపకార్థం ఆ జిల్లా నుంచి జ్యోతిని తీసుకొచ్చి విజయరాఘవన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, ఉపాధ్యక్షులు విక్రమ్. కేరళ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్. ప్రధానకార్యదర్శి తీగల సాగర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్వెస్లీ, స్కైలాబ్బాబు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరామనాయక్, డివైఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేశ్, వ్యకాస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వర్లు, వేదగిరి శ్రీనివాసరావు సతీమణి కళావతి. వేముల మహేందర్ సతీమణి. రొడ్డ అంజయ్య కుమారుడు పాల్గొన్నారు. సిఎన్ఎమ్ కళాకారులు తమ ఆటపాటలతో సభను ఉత్తేజపరిచారు.

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు పి.సోమయ్య



పోలవరం నిర్వసితులపై గొప్ప కవిత

- తెలంగాణ మీడియా అకాడమి చైర్మెన్ అల్లం నారాయణ, ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు నిర్వసితుల గురించి రాయడం గొప్ప అంశమని తెలంగాణ మీడియా అకాడమి చైర్మెన్ అల్లంనారాయణ, ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. డాక్టర్ కె జి సంధ్యా విప్లవ్ రచించిన ఆద్యంతాలు కవితను హైదరాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న బుక్ ఫెయిర్‌లో ప్రొఫెసర్ హరగోపాల్, అల్లం నారాయణ, కొండవీటి సత్యవతి శుక్రవారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో పాలకవర్గాలు విధ్వంసానికి పాల్పడ్డాయన్నారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా వేల మంది నిర్వాసి తులయ్యారనే విషయాన్ని సంధ్యా విప్లవ్ తన కవిత ద్వారా చెప్పారన్నారు. అల్లంనారాయణ మాట్లడుతూ.. రాష్ట్ర సాధన పోరాటం పోలవరం ప్రాజెక్ట నిర్మాణాన్ని వ్యతిరేకించిందని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరి శంకర్, మోర్తల విమల, డా.పసునూరి రవీందర్, మెర్సి మార్గరెట్ పాల్గొన్నారు.

పది దాటిన తర్వాత పబ్బుల నుంచి ఆ శబ్దాలు రావొద్దు..

- న్యూఇయర్ సందర్భంగా హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో రాత్రి 10 నుంచి ఉదయం ఆరు గంటల మధ్యకాలంలో పబ్బుల నుంచి డ్రమ్స్, పాటలు, డ్యాన్స్‌ల శబ్దాలు వెలువడకూడదని హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అనుబంధ పిటిషన్లను కొట్టేసింది. జూబ్లీహిల్స్ పబ్‌లు జనావాసాల మధ్య ఉన్నాయనీ, అందువల్ల సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. ఫర్జీ కేఫ్, అమ్నీసియా లాంజ్ బార్, బ్రాడ్‌వే ది బ్రూవరీ పబ్‌ల విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సన్‌బర్న్ సూపర్‌క్లబ్ వేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ భాస్కర్‌రెడ్డి డివిజన్ బెంచ్ శుక్రవారం డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

'ఎరుపు' మెరుపు

- వ్యకాస బహిరంగసభతో.. సత్తా చాటిన కమ్యూనిస్టులు
- స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజానీకం
- బూర్జువా పార్టీల్లో అంతర్మథనం
- జీర్ణించుకోలేకపోతున్న బిజెపి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గడ్డపై ఎర్రజెండా రెపరెపలాడింది. కమ్యూనిస్టుల సత్తా ఏంటో చాటేలా ఖమ్మంలో గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) బహిరంగ సభ సాగింది. ఊళ్లకు ఊళ్లు ఈ సభకు తరలి వచ్చాయి. లక్షకు పైగా శ్రమజీవులు స్వచ్ఛందంగా వచ్చి కమ్యూనిస్టులతోనే తమ మనుగడ అని చాటారు. కమ్యూనిస్టులకు ఈ సభ ఉత్తేజాన్ని ఇచ్చిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఓ సభకు పట్టుమని పది వేల మందిని తరలించడానికే రూ.కోట్లకు కోట్లు వెచ్చిస్తున్న తరుణంలో అంతమంది జనం స్వచ్ఛందంగా తరలిరావడం చర్చనీయాంశంగా మారింది. ఈ సభ ఇంతలా విజయవంతం కావడం వెనుక ఆ పార్టీ ఖమ్మం జిల్లా, మండల కమిటీ నాయకులు 500 మందికి పైగా నాలుగు నెలలపాటు విరామమెరుగక పరిశ్రమించినట్టు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. బూర్జువా పార్టీలు ఇంత భారీ స్థాయిలో సభ నిర్వహించాలంటే కనీసం రూ.పది కోట్లైనా ఖర్చు చేస్తాయని.. అటువంటిది ప్రజలే స్వచ్ఛందంగా తరలిరావడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. బూర్జువా పార్టీల్లో అంతర్మథనం మొదలైంది. కమ్యూనిస్టుల అవసరం ప్రజలకు ఎంతలా ఉందో ఈ సభ నిరూపించిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఫలించిన కృషి...

వామపక్ష శ్రేణుల్లో ఈ సభ జోష్ నింపిందనే చెప్పవచ్చు. ప్రధానంగా సిపిఎం ఈ సభ నిర్వహణ బాధ్యతలు చూసినా.. సోదర వామపక్షాల్లో నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. నాలుగు నెలల కిందట ఆహ్వాన సంఘం ఏర్పడి ఖమ్మం నగరంలో సుమారు 40 వేల కుటుంబాలను ప్రత్యక్షంగా కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మరో 40 వేల కుటుంబాలనూ నాయకత్వం కలిసింది. ప్రజలు 10 రూపాయలు మొదలు తోచిన సహాయం అందించారు. సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసుకొని సద్దులు కట్టుకొని మరీ ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడం గమనార్హం. వీటికి తోడు గోడ రాతలు, కళాప్రదర్శనలు, ముఖ్యంగా దాదాపు నెలరోజుల పాటు శిక్షణ పొందిన రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు, మండలాల్లోనూ వందల సంఖ్యలో యువత 'ఏక్ దో ఏక్' అంటూ నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ శిక్షణ, ప్రభాతభేరీ, ఇంటింటి ముగ్గులు, మైక్ ప్రచారం.. ఇలా వివిధ రకాలుగా విస్తృత కాంపెయిన్ కొనసాగింది. దానికి తగినట్టుగానే జన సమీకరణ జరగడం.. ఆ పార్టీ శ్రేణుల్లో జోష్‌కు కారణమైంది. 1996లో ఇదే గ్రౌండ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించిన భారీ బహిరంగసభను నాయకులు గుర్తుచేసుకున్నారు. ఆసభను చూసినవారు ఇప్పుడు ఈ సభను చూసి కమ్యూనిస్టుల పట్ల ఆదరణ తగ్గలేదని తెలుస్తోందని అంటున్నారు. డబ్బులిస్తే తప్ప రాని జనాలు సమిష్టిగా వాహనాలను ఏర్పాటు చేసుకొని రావడంపై చర్చ సాగుతోంది.

వామపక్షాల జోష్..

బహిరంగ సభ వామపక్షాల్లో జోష్ నింపింది. పూర్వవైభవానికి ఇది ఉపకరిస్తుందనే అభిప్రాయం వెలువడుతోంది. బీజేపీ శ్రేణులు మాత్రం ఈ సక్సెస్‌ను జీర్ణించికోలేక పోతున్నాయని వామపక్షాలు అంటున్నాయి. కాషాయ నేతలు శుక్రవారం అక్కసు వెళ్లగక్కడంపై విమర్శలు వస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో కేంద్రీకరించే నియోజకవర్గాల్లో గెలుపునకు బలం చేకూరుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టుల అవసరం ఉందనే అభిప్రాయం మరింతగా బలపడుతోందని కొందరంటున్నారు. వెరసి ఖమ్మం బహిరంగ సభ సక్సెస్ కావడంపై వామపక్షాల్లో జోష్ నింపిందన్నది విశ్లేషకుల మాట.

ఒకటి నుంచి నుమాయిష్..

- హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహణ...
- గతం కన్నా ఎక్కువ స్టాళ్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రతీయేటా నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)కు ఇప్పుడూ రంగం సిద్ధమైంది. జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 15 వరకు ఇది కొనసాగనుంది. ఈ మేరకు శుక్రవారం నాంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎగ్జిబిషన్ సొసైటీ గౌరవ కార్యదర్శి వి సాయినాథ్ దయాకర్ శాస్త్రి, ప్రచార సబ్ కమిటీ కన్వీనర్ ధీరజ్ కుమార్ జైస్వాల్, సలహాదారు పి హరినాథ్‌రెడ్డి, సొసైటీ కోశాధికారి పాపయ్య చక్రవర్తి తదితరులు వివరాలను వెల్లడించారు. గతేడాది కన్నా ఈ సారి ఎక్కువ స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్టు వారు తెలిపారు. ఇప్పటికే 2,350 స్టాళ్ల ఏర్పాటు కాగా, మరి కొన్నింటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతీ వస్తువునూ మార్కెట్‌లో లభించే ధర కన్నా తక్కువ ధరకే అమ్మేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జనవరి ఒకటిన ప్రారంభోత్సవ సభకు సొసైటీ అధ్యక్షులు, వైద్యారోగ్యశాఖ మంత్రి టి హరీశ్‌రావు అధ్యక్షత వహిస్తారని చెప్పారు. హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.



మహిళా సాధికారతను ప్రోత్సహించాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- నారాయణమ్మ కాలేజీ సందర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్

మహిళా సాధికారతను సమాజం అన్ని స్థాయిల్లో ప్రోత్సహించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. హైదరాబాద్ షేక్‌పేట్‌లోని జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజీ అండ్ సైన్స్ కాలేజిని రాష్ట్రపతి సందర్శించారు. ఆ విద్యా సంస్థ సిల్వర్ జూబ్లి వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్రపతి మాట్లాడారు. టెక్నలాజీ ఫలితాలు మారుమూల ప్రాంతాల్లోని పేదలు, నిరుపేదలకూ చేరువ కావాలన్నారు. సామాజిక న్యాయానికి దోహదం చేయాలన్నారు. ఇంజనీర్లు ప్రపంచాన్ని గొప్ప శక్తిగా మార్చగలరని తెలిపారు. డిజిటల్ చెల్లింపులు, స్మార్ డివైజెస్, ఇంటర్నెట్, మెడికల్ పరికరాలు, కంప్యూటర్లు తదితర వాటిలో ఇంజనీర్లదే కీలక పాత్ర అని గుర్తు చేశారు. ఈ సమావేశంలో గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి, రాష్ట్ర మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, జిఎన్ఐటిఎస్ చైర్మన్ సుబ్బా రెడ్డి, జి పుల్లా రెడ్డి చారిటీస్ ట్రస్ట్ చైర్మన్ రాఘవ్ రెడ్డి, జిపిఆర్ చారిటీస్ ట్రస్టీ జి ఏకంబర రెడ్డి, జిఎన్ఐటిఎస్ ప్రిన్సిపల్ రామేష్ రెడ్డి, శ్రీ విద్యా రెడ్డి, కాలేజి అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. జి పుల్లా రెడ్డి గొప్ప ముందు చూపుతో 25 ఏళ్ల క్రితమే ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో తొలి మహిళా ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేశారని సుబ్బారెడ్డి తెలిపారు.

జస్టిస్ షమీమ్ అక్టర్‌కు ఘన వీడ్కోలు..

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైకోర్టులో సీనియర్‌న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శుక్రవారం హైకోర్టు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికింది. చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అధ్యక్షతన ఫుల్‌కోర్టు సమావేశమై వీడ్కోలు చెప్పింది.

పంచుడు రాష్ట్ర సర్కార్ వంతు.. పెంచుడు కేంద్ర సర్కార్ వంతు

- పాడి ఆవుల నుంచి సైనికుల వరకూ ప్రతిదీ రాజకీయాలకు వాడుకుంటున్న బిజెపి
- దుబ్బాకలో చేసేది తామైతే.. చెప్పుకునేది మరొకరు..
- ఈ ప్రాంత అభివృద్ధిపై సిఎం కెసిఆర్‌కు ప్రత్యేక ప్రేమ
- మార్కెట్ గోడౌన్, బస్టాండ్‌ను ప్రారంభించిన మంత్రులు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని ప్రతి గడపకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పంచుతోంది సిఎం కెసిఆర్ సర్కారైతే, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర ధరలు పెంచుడు, ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్ముడు బిజెపి ప్రభుత్వ వంతుగా ఉందని మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రులు హరీశ్‌రావు, అజయ్ కుమార్, నిరంజన్ రెడ్డి, ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. హబ్సిపూర్ గ్రామ శివార్లలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రూ. ఎనిమిది కోట్ల వ్యయంతో నిర్మించిన పది వేల మెట్రిక్ టన్నుల గోదాం సముదాయాలను, దుబ్బాక పట్టణ కేంద్రంలో రూ. మూడు కోట్లన్నర వ్యయంతో నిర్మించిన మోడల్ బస్టాండ్‌ను ప్రారంభించారు. రాజక్కపేట గ్రామంలో రూ.20 కోట్ల వ్యయంతో దుబ్బాక-రాజక్కపేట రోడ్డు వెడల్పు పనులు, పోతారం గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాలను, రెడ్డి సంఘం, 33/కెవి సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపనలు చేశారు. అంతకుముందు హబ్సిపూర్ నుంచి దుబ్బాక బస్టాండ్ వరకు బిఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి రాష్ట్ర మంత్రులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం దుబ్బాకలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పాటు చేసిన ఎఎంసి నూతన పాలకవర్గ అభినందన సభలో పాల్గొని వారు మాట్లాడారు.

దుబ్బాకపై సిఎం కెసిఆర్‌కు అమితమైన ప్రేమ ఉందని, అభివృద్ధికై వందల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారని కొనియాడారు. దుబ్బాకలో నూతన మోడల్ బస్టాండ్‌ను నిర్మించామన్నారు. దుబ్బాక నుంచి తిరుపతికి రెండు నూతన సూపర్ లగ్జరీ బస్సులను మంజూరు చేసినట్టు, త్వరలోనే మరిన్ని నూతన బస్సులను మంజూరు చేస్తామని చెప్పారు. డబుల్ ఇళ్ల కాలనీలో అంగన్వాడీ కేంద్రం, బస్తీ దవాఖానా, వంద పడకల ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఏళ్ల తరబడి ఎండిపోయి ఉన్న కూడవెల్లి వాగు నేడు కాళేశ్వరం నీళ్లతో నిండుకుండను తలపిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో వ్యవసాయ పరిశ్రమలు తెచ్చి గ్రామాల్లోని నూతన ఉపాధి కల్పించే యోచనలో సిఎం కెసిఆర్ ఉన్నారన్నారు. ప్రతి జిల్లాలో ఐదు వందల నుంచి వెయ్యి ఎకరాల వరకు ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు స్థాపించే ఉద్దేశంతో సిఎం కెసిఆర్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. 2018 ఆగస్టులో మొదలైన రైతుబంధు నేటి వరకు పది విడతల్లో తెలంగాణ వ్యాప్తంగా 1.53 కోట్ల ఎకరాలకుగాను రూ.65.559 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించామన్నారు. మూడు రోజుల్లో 42 లక్షల ఎకరాలకు రైతుబంధు వచ్చిందన్నారు. బిజెపి సర్కార్ పాడి ఆవుల నుంచి దేశ సైనికుల దాకా ప్రతీది రాజకీయాలకు వాడుకుంటుందని విమర్శించారు. అధికారంలోకి వస్తే కోట్లలో ఉద్యోగాలు ఇస్తామని, జనధన్ ఖాతాల్లో లక్షల్లో డబ్బులు వేస్తామని చెప్పిన బిజెపి సర్కార్ ఎప్పుడు వేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టుడు, ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్ముడే బిజెపి సర్కార్ పని అని విమర్శించారు. బిజెపి అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు అటు దేశానికి, ఇటు తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణ బాలకిషన్ గౌడ్, జెడ్‌పిటిసి కడ్తాల రవీందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖలు చేసిన భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేష్‌పై వికారాబాద్ జిల్లా కొడంగల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌పి కోటిరెడ్డి, కొడంగల్ రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల కిందట కొడంగల్ మండలం రావులపల్లి గ్రామంలో నిర్వహించిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో బైరి నరేష్ పాల్గొని అయ్యప్ప స్వామిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇది వైరల్‌గా మారడంతో అయ్యప్ప స్వాములు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో బైరి నరేష్ అనుచరుడు వీడియో తీయడంతో అతనిపై దాడి చేశారు. దాంతో పోలీసులు జోక్యం చేసుకుని అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని అయ్యప్ప స్వాములు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బైరి నరేష్‌పై అయ్యప్ప స్వాములు ఫిర్యాదు చేశారు. కాగా, బైరి నరేష్‌పై నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

చదువుల తల్లికి రాజీవ్ సాగర్ ఆపన్నహస్తం..

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తన స్వగ్రామమైన వెలుగుపల్లిలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మల్లెపాక రాములు కుమార్తె శ్వేతకు తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆపన్న హస్తం అందించారు. శ్వేతకు టికెఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో సీటు లభించింది.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాములు తన కూతురు కాలేజీ హాస్టల్ ఫీజు కట్టలేకపోయాడు. ఈ విషయం రాజీవ్ సాగర్ దృష్టికి రాగా నాలుగేళ్లపాటు హాస్టల్ ఫీజును తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. దాంతోపాటు ఆమెకు ఏడాదికి అయ్యే హాస్టల్ ఫీజు రూ.25 వేలను శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో అందజేశారు. చదువు పూర్తయ్యే వరకు అండగా ఉంటానని రాజీవ్ సాగర్ విద్యార్థినికి భరోసా ఇచ్చారు. బాగా చదివి ఇంజనీరింగ్‌లో రాణించి ఊరి పేరు నిలబెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా శ్వేత కుటుంబ సభ్యులు రాజీవ్ సాగర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా పిఆర్‌టియు జనరల్ సెక్రటరీ ధర్మారపు వెంకటయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు మల్లెపాక రాములు, వెలుగుపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ గుడిపాటి కమలాకర్, మాజీ విద్యా కమిటీ చైర్మెన్ మల్లెపాక యాదగిరి పాల్గొన్నారు.

అర్ధరాత్రిదాకా మద్యం షాపులకు అనుమతి ఇవ్వొద్దు

- మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అర్ధరాత్రి దాకా మద్యం షాపులకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఎం కెసిఆర్ పాలనను గాలికొదిలేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా శుక్రవారం ప్రగతి భవన్‌కు ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. గాంధీభవన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తోపులాట జరిగింది. నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ మద్యం షాపులు అనుమతి వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మద్యం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు సర్కారు ప్రజలను తాగుబోతులుగా మార్చుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో క్రైం రేటు పెరిగిపోయిందనీ, మహిళల రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి ఒంటి గంట వరకు మద్యం షాపులు తెరచి ప్రజలను లూటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నదని చెప్పారు. మైనర్లపై లైంగికదాడులు జరుగుతుంటే, అర్ధరాత్రి వరకు మద్యం షాపులు తెరిచేందుకు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. డిసెంబర్ 31న మద్యం షాపులు పూర్తిగా మూసేయాలనీ డిమాండ్ చేశారు.

యాదాద్రీశుని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- ఘన స్వాగతం పలికిన మంత్రులు
- పూర్ణకుంభంతో అర్చకుల స్వాగతం
- అడుగడుగునా పోలీసుల బందోబస్తు


యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దర్శనార్థం వెళుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్ర పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఉదయం యాదాద్రిని సందర్శించారు. రాష్ట్రపతికి మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, కలెక్టర్ పమేలా సత్పతి ఘనస్వాగతం పలికారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదాద్రికి చేరుకున్నారు. మొదటిసారి ఆలయానికి వచ్చిన రాష్ట్రపతికి సన్నాయి మేళతాళాలతో ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు సంకల్పం, సువర్ణపుష్పార్చన పూజలు నిర్వహించారు. చతుర్వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ పరిసరాలను రాష్ట్రపతి పరిశీలించారు. దేవాలయ పూర్వ, అధునాతన నిర్మాణాలను, స్థల సేకరణ, కాటేజీల వసతులు అభివృద్ధిని ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వివరించారు. యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ విశిష్టతను వివరించారు. రాష్ట్రపతికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి లక్ష్మి నరసింహ స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అనంతరం రాష్ట్రపతి తిరుగు ప్రయాణమయ్యారు.

భారీ బందోబస్తు...

దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము యాదాద్రికి వచ్చిన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాచకొండ కమిషనర్ మహేష్ భగవత్ పర్యవేక్షణలో ఆరుగురు డిఎస్‌పిలు, 15 మంది ఎసిపిలు, వంద మంది ఎస్సైలు, 1200 పోలీస్‌లు బందోబస్తులో ఉన్నారు. వీరిలో రెండు వందల మంది మహిళా పోలీసులు ఉన్నారు. యాగ స్థలంలో మూడు హెలిపాడ్లు నిర్మించారు. యాదగిరి గుట్టలో ర్యాలీలు, సభలు, సమావేశాల నిషేధంతోపాటు 144 సెక్షన్ అమలు పరిచారు. యాదగిరిగుట్టకు మూడు వైపుల నుంచి వచ్చేమార్గాల్లో వాహనాలను నిలిపివేశారు.

ప్రజలకు ఆర్జిత సేవలు నిలిపివేత

రాష్ట్రపతి రాక నేపథ్యంలో తెల్లవారుజామున సుప్రభాత సేవల నుంచి మధ్యాహ్నం నివేదన ఆర్జిత సేవలకు సామాన్య ప్రజలకు అనుమతి ఇవ్వలేదు. నూతన సంవత్సరం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం వేచి ఉన్నారు. వారు వసతి గృహాల్లో ఉన్నారు. ముందస్తుగా కొండపై, కొండ కింద వ్యాపార దుకాణాలను మూసివేయించారు.

దేవాలయం ప్రత్యేక అలంకరణ

దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో, పెద్ద ఎత్తున పూల అలంకరణ చేశారు. ప్రాంగణంలో రెడ్ కార్పెట్ పరిచారు. ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికులను నియమించారు. వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు వైద్యులు, నర్సు, బ్లడ్ డోనర్‌ను అంబులెన్స్, ఫైర్ ఇంజన్‌ను, రెవెన్యూ సిబ్బందిని అందుబాటులో పెట్టారు.

పోలీస్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కునంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమైక్య (ఎఐఎస్ఎఫ్) ఉస్మానియా యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఓయూ మెయిన్ లైబ్రరీ ఐసిఎస్ఎస్ఆర్ హాల్లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. సత్యనెల్లి, ఉప్పల ఉదయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కూనంనేని మాట్లాడారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం, టిఎస్ఎల్‌పిఆర్‌బి చైర్మెన్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఉద్దేశపూర్వకంగానే అలసత్వం వహిస్తూ అభ్యర్థులను మానసిక వేదనకు గురిచేస్తూ ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఇప్పటికే కొంతమంది అభ్యర్థులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. తప్పుడు ప్రశ్నలకు మార్కులు కలపాలని, ప్రశ్న పత్రాలు తయారుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుని అమలు చేయాలని కోరారు. అలాగే, ఈవెంట్స్ విషయంలో అభ్యర్థులను సినిమా యాక్టర్ల గ్రాఫిక్స్ మాదిరిగా లాంగ్ జంప్ చేయమనడం సరికాదన్నారు. నాలుగు మీటర్ల లాంగ్ జంప్‌ను ఎత్తివేసి పాత పద్ధతినే అమలు చేయాలన్నారు. సమస్యను పరిష్కరించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ అండగా ఉంటుందన్నారు. శనివారం ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జావేద్, పిడిఎస్‌యు నాయకులు అల్లూరి విజయ్ వక్తలుగా ప్రసంగించారు. ఎస్ఐ,కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ఉమ్మడి పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రహమాన్, ఓయూ నాయకులు సాయి భగత్, లెనిన్, సుమన్, ప్రభాకర్, ప్రదీప్, విజయ, రోజా, మహేష్, దివ్య, పోలీసు ఉద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలోని పలు పట్టణాల మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. వికారాబాద్, కాచిగూడ, హైదరాబాద్, నర్సాపూర్, కాచిగూడ స్టేషన్ల నుంచి 16 రూట్లలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ఈ రైళ్లు జనవరి 7 నుంచి 18వ తేదీ వరకు ఆయా రూట్లలో తిరుగుతాయి. డిసెంబర్ 31 నుంచి ఈ రైళ్లలో అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు.

పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడకం పెరగాలి

- సేంద్రీయ ఉత్పత్తుల మేళాను ప్రారంభించిన..
- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి


స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనాభా అవసరాలకు సరిపడా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో వ్యవసాయక విప్లవం పేరుతో రసాయనిక ఎరువులు, ఆధునిక వంగడాలను ప్రవేశ పెట్టారని, కానీ వాటిని వాడే విధానంపై రైతులకు అవగాహన కల్పించడంలో గత పాలకులు విఫలమయ్యారని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేట పట్టణంలోని మల్టీ పర్పస్ హైస్కూల్‌లో బాల వికాస ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే 'సేంద్రీయ రైతుల మెగా మార్కెట్ ఆర్గానిక్' మేళాను రాష్ట్ర మంత్రులు హరీశ్ రావు, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచమంతా భూసార సంరక్షణ, టెర్రరిజం నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తుంటే, భారత దేశాన్ని పాలిస్తున్న కేంద్ర ప్రభుత్వం మాత్రం మహారాష్ట్ర, కర్ణాటక మధ్య మతం, కులం చిచ్చు పెడుతుందని విమర్శించారు. జనాభా పెరుదలకు అనుగుణంగా ఆహార ఉత్పత్తుల్ని పెంచేందుకు మొదట్లో వాడిన సేంద్రియ పద్ధతులను పక్కన పెట్టి క్రిమి సంహారక మందుల వాడకం మొదలు పెట్టామన్నారు. మందుల వాడకం మోతాదుకు మించడంతో ప్రపంచ వ్యాప్తంగా మరో 50 పంటలు మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా భూసార పరీక్షలు జరిపి అవసరమైన మందులను వాడుతూ సేంద్రియ పంటల సాగుకు రైతులు రావాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. మోతాదుకు మించి ఎరువుల వాడకం వల్ల భూమి నిస్సారమైందని, సారవంతమైన భూమిలో ఏడు శాతం కార్బన్ ఉండాల్సి ఉండగా ప్రస్తుతం దేశంలో సగటున ఒక శాతం మాత్రమే ఉన్నదన్నారు. ఎక్కువ ఎరువులు వేస్తే ఎక్కువ ఉత్పత్తి వస్తుందనే ఆలోచనలో రైతులు ఉన్నారన్నారు. ప్రపంచానికి ఆహార పదార్థాలను ఒక్క భారతదేశం మాత్రమే సప్లై చేయగలదన్నారు. ఆ దిశగా మెరుగైన వ్యవసాయ విధానాలు అనుసరించట్లేదన్నారు. ఏ ప్రయత్నం అయినా మొదటి చిన్నగానే ప్రారంభం అవుతుందని ప్రజలు దాన్ని ఆచరించినప్పుడే అది ఒక చరిత్రగా నిలుస్తుందన్నారు. సిద్దిపేటకు వచ్చిన ప్రతిసారి ఏదో ఒక కొత్త విషయం నేర్చుకునేందుకు తాను వస్తున్నానన్నారు. హరీశ్ రావును అనుసరిస్తూ సిద్దిపేటలో జరిగే అభివృద్ధిని కాపీ కొట్టి మా నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. తెలంగాణలో 50 ఏండ్ల కిందట పశువుల పేడ, పచ్చిరొట్ట ఎరువులు వాడేవారని గుర్తుచేశారు. అనంతరం బాలవికాస ఆధ్వర్యంలో ప్రారంభించిన మేళాను మంత్రులు పరిశీలించారు. 150 మంది రైతులకు సేంద్రియ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాల వికాస డైరెక్టర్ శౌరి రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం

- డిసెంబర్‌లో 14,017 మెగావాట్లకు చేరిక
- యాసంగిలో 15,500 మెగావాట్లకు చేరుతుందని అంచనా
- సాగువిస్తీర్ణం పెరగడమే కారణం- టివిఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి
- ఆటోమేటిక్ స్టార్టర్లు ఆఫ్ చేయండి-టివిఎస్‌ఎస్‌పిడిసిఎల్ సిఎండి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరింది. డిసెంబర్ నెలలో ఈ స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరగడం ఇదే తొలిసారి. గత ఏడాది డిసెంబర్‌లో విద్యుత్తు డిమాండ్ 10,935 మెగావాట్లు కాగా, ఇప్పుడు 14,017 మెగావాట్లకు పెరిగింది. రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం 2021లో 14,160 మెగావాట్లు కాగా, ఈ ఏడాది మార్చిలో ఈ డిమాండ్ 15,500 మెగవాట్లకు చేరుతుందని విద్యుత్ సంస్థలు అంచనా వేశాయి. అయితే ఆ మేరకు విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థల్ని బలోపేతం చేసినట్టు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు చెప్పారు. రాష్ట్రం ఏర్పడే నాటికి విద్యుత్ డిమాండ్ 6,666 మెగావాట్లు కాగా, ఇప్పుడు వందశాతం కంటే ఎక్కువగా పెరిగింది. విద్యుత్ సరఫరా వ్యవస్థను 2014తో పోల్చిచూసినప్పుడు, అప్పట్లో 220 కేవీ సబ్‌స్టేషన్లు 51 ఉండగా, ఇప్పుడు వాటిసంఖ్య 99కి పెరిగింది. అలాగే 32 కేవీ సబ్‌స్టేషన్లు అప్పట్లో 175 ఉండగా, ఇప్పుడు 307కి పెరిగాయి. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లు 1 కోటి 71 లక్షల 307 ఉన్నాయి. వీటిలో 55 లక్షలకు పైగా నూతన కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ పంపిణీ సంస్థల్లో సాంకేతికతకు పెద్ద పీట వేయడంతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత ఏడాదిలో విద్యుత్ డిమాండ్ 3,450 మెగావాట్లు ఉండగా, ఈ ఏడాది 4వేల మెగావాట్లకు చేరే అవకాశం ఉన్నట్టు టిఎస్-ఎస్‌పిడిసిఎల్ ఉన్నతాధికారులు అంచనా వేశారు. విద్యుత్ డిమాండ్ పెరగడం పట్ల ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ఆయా సంస్థల ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు.

సాగు విస్తీర్ణం పెరిగినందువల్లే...
- దేవులపల్లి ప్రభాకరరావు

రాష్ట్రం ఏర్పడినప్పటికీ, ఇప్పటికీ విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరుగుతున్నది. ప్రభుత్వం ఈ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు 24 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వాలని ఆదేశించింది. ఆ మేరకు మా పంపిణీ వ్యవస్థల్ని పటిష్టం చేసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తికావడం, వర్షాలు సకాలంలో కురవడం, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలకు చెరువుల్లో పూడికలు తీసినందువల్ల భూగర్భ జలాలు పెరిగాయి. ఫలితంగా వ్యవసాయం రికార్డు స్థాయిలో పెరిగింది. దానికి తోడు అనేక పెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి రావడం కూడా ఓ కారణం. ఈ ఏడాదికి విద్యుత్ డిమాండ్ 15,500 మెగవాట్లకు చేరినా విద్యుత్ సరఫరా చేయడానికి అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

ఆటోమేటిక్ స్టార్టర్లు తీసేయండి...
- జీ రఘుమారెడ్డి

తమ మోటార్లకు బిగించిన ఆటోమేటిక్ స్టార్టర్లను రైతులు తొలగించాలి. దానివల్ల వ్యవసాయంలో అవసరానికి మించి నీటి వినియోగం జరుగుతున్నది. ఫలితంగా విద్యుత్ వినియోగం దుర్వినియోగం అవుతున్నది. విద్యుత్ పంపిణీ సంస్థల్లో పూర్తిస్థాయిలో సాంకేతికతను అప్‌గ్రేడ్ చేశాం. వినియోగదారులు కరెంటు ఆఫీసులకు రాకుండానే, తమ సమస్యల్ని పరిష్కరించుకొనేలా చర్యలు చేపట్టాం. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహిస్తున్నాం. ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ మెషిన్లతో బిల్లులు ఇస్తున్నాం. కరెంటు సరఫరాలో ఎలాంటి అవాంతరం ఏర్పడినా, తక్షణం తెలుకునేలా సాంకేతికతను అప్‌గ్రేడ్ చేశాం. రాష్ట్ర ఆవిర్భావం తర్వాతి నుంచి ఇప్పటి వరకు విద్యుత్ పంపిణీ సంస్థలకు 38 అవార్డులు వచ్చాయి.



ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

హెచ్‌ఆర్‌సికి ఎఐవైఎఫ్ ఫిర్యాదు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి, అభ్యర్థులు సంయుక్తంగా శుక్రవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ (టిఎస్-ఎల్‌పిఆర్‌బి) ఇటీవల నిర్వహించిన దేహదారుఢ్య అర్హత విభాగాల్లో లక్షలాది మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు నష్టపోయారని పేర్కొన్నారు. బోర్డు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పురుషులకు, మహిళలకు దేహధారుఢ్య పరీక్షలలో కొన్ని మార్పులు చేస్తూ కొత్త నిబంధనలను తీసుకొచ్చారని తెలిపారు. దీంతో నష్టపోయారనీ, దీనికి టిఎస్ఎల్‌పిఆర్‌బి చైర్మన్ తీసుకున్న అసంబద్ధ నిబంధనల నిర్ణయాలే కారణమని ఆరోపించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల విలీనంపై సిబిఐకి ఫిర్యాదు : మల్లు రవి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హస్తం గుర్తుపై గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలను టిఆర్ఎస్ఎల్‌పిలో విలీనం చేయడంపై సిబిఐకి ఫిర్యాదు చేస్తామని పిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి చెప్పారు. అందులో కొంత మంది డబ్బులు, మరికొంత మందికి పదవులు ఆశ చూపించి, గులాబీ కండువా కప్పారని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒకేసారి 12 మంది ఎమ్మెల్యేలు టిఆర్ఎస్‌లో విలీనం అవుతున్నట్టు సిఎం కెసిఆర్ ప్రకటించారని గుర్తు చేశారు.

వ్యవసాయ కార్మికులను చైతన్యపరిచేలా పోరాటాలు

వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ కార్మికులను చైతన్యపరిచేలా పోరాటాలు చేయబోతున్నట్టు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రామలు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు నగర్ (భక్తరామదాసు కళాక్షేత్రం)లోని అమరవీరుల ప్రాంగణంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభలో ప్రధాన కార్యదర్శి నివేదికను ఆయన ప్రవేశపెట్టారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోతుండటం, మరోవైపు యాంత్రీకరణతో కూలీలకు పనులు దొరకడం చెప్పారు. మరోవైపు కేంద్రం చర్యలతో ఉపాధి హామీ చట్టమైనా సరిగ్గా అమలు కావడం లేదన్నారు. దీంతో వ్యవసాయ కార్మికులు పట్టణాలకు వలస పోతున్నారని చెప్పారు. పట్టణప్రాంతాల్లోని అసంఘటిత కార్మికులను చైతన్యం చేయాల్సిన బాధ్యత వ్యవసాయ కార్మికులపైనా ఉందన్నారు. తెలంగాణలో వ్యవసాయ కూలీలకు రూ. 250 నుంచి 300లోపే వేతనం పడుతున్నదన్నారు. కనీసవేతన చట్టం రివైజ్ కోసం పోరాటం చేయబోతున్నట్టు తెలిపారు. గ్రామాల్లో కూలిపోరాటాలను ఉధృతం చేయాలన్నారు. దేశంలో సాంస్కృతిక విప్లవమూ రావాలన్నారు. వ్యవసాయ కార్మికుల్లో రాజకీయ చైతన్యమూ పెంపొందించాల్సిన బాధ్యత వ్యవసాయ కార్మిక సంఘంపై ఉందని చెప్పారు.

అంగన్‌వాడీల పెండింగ్ టిఎ, డిఎ చెల్లించాలి

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి
- వనపర్తి కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొన్ని ఏళ్లుగా అంగన్వాడీలకు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచిన టిఎ, డిఎ చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి జిల్లా పాల కేంద్రం మరికుంట నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పి జయలక్ష్మి మాట్లాడుతూ.. 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎచ డిఎలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యలక్ష్మి, మెనూ చార్జీలు పెంచాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్రం పెంచిన వేతనాలు వెంటనే ఖాతాలో జమ చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు ఐదు లక్షలు, హెల్పర్లకు మూడు లక్షలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌కు నేరుగా రెండు సిలిండర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వనపర్తి జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు, కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, సూర్యవంశం రాము, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శారద, నారాయణమ్మ, కవిత, భాగ్యలక్ష్మి, రమాదేవి, జ్యోతి, లక్ష్మీదేవి, మాధవి పాల్గొన్నారు.



పింగళి వైదుష్య సినీ సంభాషణల రచయిత

ప్రజాశక్తి - కల్చరల్

మాయ బజార్ పాతాళ భైరవి వంటి సినిమాలలో మాటలు నాటికి నేటికి తెలుగు ప్రజానీకంలో సుస్థిరం నిలిచి వుండటానికి కారణం పింగళి రచనా వైదుష్యమేనని సమైక్య ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు అన్నారు. ఆయన రచనా శైలిని అందిపుచ్చుకున్న సాయి మాధవ్ నేడు పలు సినిమాలకు సంభాషణల రచయితగా రాణిస్తున్నారని అభినందించారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ సాంస్కృతింక సంస్థ యువ కళా వాహిణి నిర్వ్యహణలోభాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ అలనాటి పాటలు మాటల రచయిత పింగళి నాగేంద్ర రావు పేరిట విశిష్ట సినీ రచనా పురాస్కారం ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిధిగా జస్టిస్ రామలింగేశ్వరరావు పాల్గొని పురస్కారం బహుకరించి మాట్లాడారు. నాడు అసభ్యతకు తావులేని పాటలు మాటలు సినిమాల్లో ఉండేవన్నారు. అధ్యక్షత వహించిన కళా పోషకుడు సారిపల్లి కొండల రావు మాట్లాడుతూ బుర్రా సాయి మాధవ్ నేటి తరం సినీ రచయితలలో అగ్రగణ్యులు అని కొనియాడారు. నాట్య గురువు డాక్టర్ భారతి, సాహితీవేత్త డాక్టర్ వోలెటి పర్వతీశం, డాక్టర్ చెన్నయ్య, సినీ జర్నలిస్ట్ ఎస్‌వి రామా రావు పాల్గొన్న సభకు సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ స్వాగతం పలికారు.


చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న గోరటి

మనుషుల జీవితమే పాట

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మనుషుల జీవితమే పాట అని కవి, గాయకులు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. పాట మానవ సంబంధాలపై ప్రభావం, ప్రాముఖ్యతపై హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో శుక్రవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాట లేకుంటే తానులేనన్నారు. పాట మానవ సంబంధాలను మరింత దగ్గర చేస్తుందని చెప్పారు. అల్లం నారాయణ మాట్లాడుతూ.. పాట నక్సల్బరీ ఉద్యమాన్ని నడిపించిందని, తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిందని తెలిపారు. ఉద్యమాలను పుట్టించేదే పాట అన్నారు. పాట లేకుండా మనుషుల మధ్య అనుబంధం ఏర్పడదని, శ్రమ మీద అనేక పాటలు మనల్ని ప్రభావితం చేస్తాయని చెప్పారు. గాయకుడు మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ.. పాట ప్రజలను చైతన్యం చేస్తుందని, ఒక ప్రభుత్వాన్ని నిట్టనిలువుగా చీలుస్తుందని అన్నారు. నాటి సిఎం చంద్రబాబు నాయుడును ప్రశ్నించింది పాటేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జూలూరి గౌరీ శంకర్, అభినయ శ్రీనివాస్, కోదారి శ్రీనివాస, గిద్దె రామనరసయ్య, దయా నర్సింగ్, బోడ చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి నాన్ టీచింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కెజిబివిల్లో పనిచేస్తున్న వర్కర్లు, నాన్ టీచింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల నాన్‌టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎల్ పద్మ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్లను నియమించాలని కోరారు. వారాంతపు సెలవులు అమలు చేయాలనీ, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కెజిబివిల్లో పనిచేస్తున్న వర్కర్లు, నాన్‌టీచింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలనీ, లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పి అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులు వీరమణి, సహాయ కార్యదర్శి ముధురలతో పాటు రాష్ట్ర కమిటి సభ్యులు పాల్గొన్నారు.